సాక్షి తిరుపతి

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



అన్న ప్రసాద కేంద్రంలో తనిఖీలు

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ తనిఖీ చేశారు. - 8లో



కల్యాణ వెంకన్నకు పవిత్రాల సమర్పణ

కల్యాణ వేంకటేశ్వరుడికి ఆలయ వార్షిక పవిత్రోత్సవాల్లో మూడు రోజు పవిత్రాల సమర్పణ వేడుకగా జరిగింది. - 8లో



6 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం అటవీ ప్రాంత పరిసరాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఎట్టకేలకు అడ్మిషన్లు ప్రారంభం

తిరుపతి సిటీ: ఉన్నత విద్యామండలి ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్లకు శ్రీకారం చుట్టింది. దీంతో నాలుగు నెలల పాటు వేచిచూసిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. తిరుపతి టీటీడీ డిగ్రీ కళాశాలలో గురువారం సుమారు 600 మందికి పైగా అడ్మిషన్లు పొందారు. పద్మావతి డిగ్రీ కళాశాల, ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి నెలకొంది. సీట్లు కేటాయించిన విద్యార్థులు ఈనెల 22 లోపు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని కళాశాల యాజమాన్యాలు సూచించాయి.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం



విరాళం డీడీని టీటీడీ చైర్మన్‌కు అందజేస్తున్న దాతలు

తిరుమల: విజయనగరానికి చెందిన కృష్ణ హరీష్ ఈశ్వర అనే భక్తుడు గురువారం టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈమేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన పీజీ అడ్మిషన్ల తొలివిడత రిజిస్ట్రేషన్

తిరుపతి సిటీ: పీజీసెట్–2025 రిజిస్ట్రేషన్ల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఉన్నత విద్యామండలి నిర్లక్ష్య వైఖరితో కనీసం రాష్ట్రవ్యాప్తంగా 32వేల సీట్లకు గాను కేవలం 11,400 మంది మాత్రమే పలు పీజీ కోర్సులకు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో భాగంగా ఎస్వీయూ పరిధిలోని ప్రభుత్వ వర్సిటీలతో పాటు ప్రైవేటు పీజీ కళాశాలల్లో కనీసం 30శాతం సైతం రిజిస్ట్రేషన్లు కాకపోవడం విశేషం. దీంతో ఉన్నత విద్యామండలి సోమవారం నుంచి సీట్లు పొందిన విద్యార్థులకు ఆయా కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని విద్యార్థులకు మెసేజ్‌లు పంపనుంది. మిగిలిన సీట్లకు వచ్చే వారంలో రెండో విడత అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభించనున్నట్లు నాగార్జున వర్సిటీ పీజీసెట్–2025 కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా ఏపీ



ఎడిషన్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా మారడానికి ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, ఏరోస్పేస్-డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారు డాక్టర్ జి.సతీష్ రెడ్డి తెలిపారు. సీఐఐ ఏపీ ఆధ్వర్యంలో గురువారం తిరుపతిలో జరిగిన 2వ ఎడిషన్ ఇన్నోవేషన్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. భారతదేశం ప్రపంచంలోనే తదుపరి ఆవిష్కరణ కేంద్రంగా రూపాంతరం చెందుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పరిశోధన–ఆవిష్కరణలకు విషయాలను మార్చే శక్తి ఉందన్నారు. సీఐఐ ఏపీ మాజీ చైర్మన్, లెటర్ కాంప్లెక్స్ సీఈఓ జేఎస్‌ఆర్‌కె ప్రసాద్, ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి భాస్కర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, సీఐఐ సదరన్ రీజియన్ మాజీ చైర్మన్, కావిన్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ రంగనాథన్, స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు డైరెక్టర్ నాగభరత్, ఏవన్ నిపుణుడు సునీల్ డేవిడ్, కంపెనీల నిర్వాహకులు, ప్రతినిధులు ప్రసంగించారు.

● తప్పట్లేదు..



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మంచినీటి బావి. ఇది సత్యవేడు మండలం పెద్ద ఈటిపాకం గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టకండ్రిగ గిరిజనకాలనీలో ఉంది. ఈ బావిలో చెట్లపొదలు ఏపుగా పెరిగిగాయి. ఇందులోనే చెత్త, ఇతర ఆకుల తీగలు పెరిగాయి. అయితే గిరిజనకాలనీ వాసులకు ఈ బావిలోని నీరే దిక్కు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న గిరిజన బాలుడి పేరు పోలయ్య. ఈ అబ్బాయిది వరదయ్యపాళెం హైస్కూల్ గిరిజన కాలనీ. ఒళ్లంతా చర్మ వ్యాధితో బాధపడుతున్నాడు. నీటి కలుషితం వల్ల ఇలాంటి చర్మవ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.


● డ్రైనేజీలో కొళాయి..



ఈ చిత్రంలో కనిపిస్తున్న తాగునీటి కొళాయి వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ గోవర్ధనపురంలో మురుగునీటి కాలువలో ఉంది. ఓ వైపు మురుగు నీరు పారుతుండగా అదే ప్రాంతంలో పంచాయతీ పైపులైను నుంచి తాగునీటి కొళాయి ఏర్పాటు చేసి ఉన్నారు. ఈ నీటినే సమీప ప్రజలు బిందెల్లో పట్టుకుని వినియోగించక తప్పట్లేదు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలోని వెంకటకృష్ణపాళ్యం పంచాయతీ నాగిలేరు, నాగిలేరు ఎస్టీ కాలనీలకు తాగునీటి సరఫరా కోసం 25 ఏళ్ల కిందట నిర్మించిన పాత ట్యాంకు ద్వారానే నేటికీ నీటి సరఫరా జరుగుతోంది. మోటారు నిర్వహణ లేక బోరు నీరు సరఫరా అవుతోంది. దీంతో ట్యాంకు నుంచి నీరు ఓవర్‌ఫ్లో అయి పాచి పట్టి, నీటి మొక్కలు పెరిగి, ట్యాంకు పరిసరాలు బురదమయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు.



నారాయణవనం: దుస్థితిలో నాగిలేరు ఎస్టీ కాలనీలో 25 ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకు



గూడూరు: సొసైటీ ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు

ప్రజల వేదన

ట్యాంకులు కడిగి ఎన్నేళ్లయ్యిందో?

గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని అధికార యంత్రాంగం గాలికొదిలేసింది. తాగడానికి మంచి నీరు లేక రోగాల బారిన పడుతున్నారు. పల్లెల్లో నీటి నాణ్యతా ప్రమాణాల పరీక్షలు చేయడం లేదు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. క్షేత్రస్థాయిలో పైపులైన్ల లీకేజీల కారణంగా నీరు కలుషితం అవుతున్నా.. గతి లేక ప్రజలు ఆ నీరే తాగి అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోంది. గుక్కెడు మంచి నీరు అందక.. సరైన వైద్యం పేదలు కన్నీరు పెడుతున్నా.. పాలకుల్లో ఇసుమంతైనా బాధ్యత కనిపించడం లేదు.

తిరుపతి జిల్లా పరిధిలో అస్తవ్యస్తంగా తాగునీటి వ్యవస్థ

- వాటర్ ట్యాంకులను శుభ్రం చేస్తే ఒట్టు..
- పైపులైన్ల లీకేజీలతో కలుషితం అవుతున్న నీరు
- తూతూమంత్రంగా నీటి సాంద్రత పరీక్షలు
- మూలన పడిన నీటి పరీక్ష కిట్లు
- అనారోగ్యం బారిన పడుతున్న పేదప్రజలు
- అయినా చలనం లేని కూటమి పాలకులు

వరదయ్యపాళెం: గ్రామీణ ప్రాంతాల్లో నీటి పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. జలజీవన్ మిషన్ పథకం కింద గ్రామ సచివాలయాలకు కిట్లు అందజేసింది. అయితే వీటిని చాలాచోట్ల వాడకుండానే పక్కన పెట్టేశారు. రసాయనాలు, ఔషధాలు కాలం చెల్లడంతో నిరుపయోగంగా మారాయి. ఫలితంగా నీటి పరీక్షలు చేయకపోవడంతో గ్రామీణ ప్రజలు కలుషిత నీటినే తాగుతూ రోగాల బారిన పడుతున్నారు. తిరుపతి జిల్లాలో 691 గ్రామ సచివాలయాలకు ఒక్కొక్కటి రూ.1292 విలువ చేసి మలింట నోకా మీటరు వాటర్ క్వాలిటీ ఫీల్డ్ టెస్ట్ కిట్లు అందజేశారు. వీటిని వినియోగించే విధానంపై గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. కిట్లు సరఫరా చేసిన అనంతరం వాటి వాడకంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలన చేయకపోవడంతో చాలాచోట్ల వినియోగించలేదు. గ్రామీణులు తాగే నీటిలో ఉదజని సూచిక(పీహెచ్) క్షారములు, ఇనుము, రెసిడ్యూల్, ఫ్రీక్లోరిన్ ఎంత శాతం ఉందో గుర్తించేందుకు సాంకేతిక సహాయకులు పరీక్షలు చేయడం లేదు. నీటిలో లవణాల లభ్యత, మడ్డితనం, సల్ఫర్, క్యాల్షియం ఏ మేరకు ఉందో పరీక్షించి లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేయడం లేదు. ఉప్పు, ఫ్లోరైడ్ నీటినే తాగుతున్నారు. నాణ్యత లేని నీరు తాగడంతో చాలామంది టైఫాయిడ్, విరోచనాలు, కామెర్లు, విషజ్వరాల బారిన పడుతున్నారు. మరోవైపు పైపులైన్లు లీకేజీలతో నీటి వనరులు, బోరుబావులు చుట్టూ మురుగు చేరిన నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా నీటి పరీక్షలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.


ట్యాంకుల శుభ్రత గాలికి

పంచాయతీల్లో తాగునీటి కొళాయిలకు నీటి సరఫరా జరిగే ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రత చేసే వారు లేరు. ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో నెలల తరబడి అదే నీటిని వాడుతున్నారు. ట్యాంకు లోపల పేరుకుపోయిన పాచి, క్రిములతో కూడిన కలుషిత నీటిని ప్రజలు వాడుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల పర్యవేక్షణ నామమాత్రంగా మారింది. పలుచోట్ల ట్యాంకుల పైకెక్కి శుభ్రం చేసేందుకు మెట్లు, నిచ్చెనలు కూడా లేకపోవడంతో వాటి పైకి వెళ్లలేని పరిస్థితి. దీంతో ఆ ట్యాంకుల శుభ్రత గాలికే.

ఏర్పాటు కాని ఇన్‌లైన్ క్లోరినేషన్

గ్రామాల్లో డైరెక్ట్ పంపింగ్ ద్వారా పంచాయతీ కొళాయిలకు నీటి సరఫరా చేసే పైపులైన్‌కు ఇన్‌లైన్ క్లోరినేషన్ అమర్చాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ ప్రక్రియ ఎక్కడా అమలు కాలేదు. ఈ పద్ధతి ద్వారా డైరెక్ట్ పంపింగ్ ద్వారా నీటి సరఫరా చేసే జలాలను శుద్ధి చేస్తుంది. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నది. ఇన్‌లైన్ క్లోరినేషన్ అనేది పైపులలో నీరు ప్రవహించేటప్పుడు ఆటోమేటిక్‌గా క్లోరిన్ జోడించడం ద్వారా నీటిని శుద్ధి చేస్తుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ప్రక్రియను ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తుంది.

గేట్ వాల్వ్ పైపుల్లో నీరు కలుషితం



కోట ఆకుతోట దిబ్బవీధిలో గేట్‌వాల్వ్ దగ్గర పైపుల్లో కలుస్తున్న కలుషిత నీరు

కోట: మండలంలోని 21 పంచాయతీల్లో 47 రక్షిత మంచినీటి పథకాలు, పైలట్ ప్రాజెక్ట్ పేరుతో మరో 2 సమగ్ర మంచినీటి పథకాలు అంటే మొత్తం 52 వాటర్ ట్యాంక్‌లు ఉన్నాయి. పంచాయతీల సహకారంతో వారానికోసారి వాటర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేస్తున్నారు. అయితే పైలట్ ప్రాజెక్ట్ ద్వారా ట్యాంక్‌లకు సరఫరా చేస్తున్న నీరు గేట్ వాల్వ్ దగ్గర కలుషితం అవుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. కోటలో పలుచోట్ల గేట్ వాల్వ్ దగ్గర నీరు పైపు ల నుంచి బయటకు వస్తున్నట్లు గుర్తించారు.

తిరుపతి జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా వివరాలు

ఓవర్ హెడ్ ట్యాంకులు	2224
తాగునీటి కొళాయిలు	3.70లక్షలు
డైరెక్ట్ పంపింగ్ బోర్లు	1230

చిల్లకూరులో..



చిల్లకూరు: మెట్లు కూడా లేని తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు

చిల్లకూరు : మండలవ్యాప్తంగా తాగునీటిని సరఫరాను వాటర్‌మెన్‌లే పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీ అధికారులు పైపులైన్ల లీకేజీలు ఉన్నా పట్టించుకోవడం లేదు. ఓవర్ హెడ్ ట్యాంకులను మూడు నెలలకు ఒకసారి తూతూ మంత్రంగా శుభ్రం చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే సమయంలో మాత్రం కోరోఫిల్ మాత్రను పంపింగ్ చేసే పైపుల వద్ద వేసి.. ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్ మాట్లాడుతూ కోరోఫిల్ మాత్రను వినియోగించేందుకు జిల్లాలో చిల్లకూరు మండలానికి మాత్రమే అవకాశం దక్కిందన్నారు.


శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలో సుమారుగా 15 వేల కుటుంబాలకు పైగా నివాసం ఉండగా, సుమారు 80 వేల మంది వరకు జీవనం సాగిస్తున్నారు. పట్టణంలో 10 వరకు ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా వాటిలో సుమారు 6 వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పుడు శుభ్రం చేశారనే విషయం కూడా మున్సిపాలిటీలోని తాగునీటి విభాగం వారు కూడా చెప్పలేకపోతున్నారు. కొన్ని ట్యాంకులకు నిచ్చెనలు, మెట్లు లేవు. కండలేరు నీటిని వేములపాళెం వద్ద ఉన్న ఫిల్టర్ చేసి పంపింగ్ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

వాకాడులో..

వాకాడు దళితవాడలో పైపులైన్లు లీకేజీ అవుతుండడంతో దాదాపు నెల రోజులుగా ప్రజలు మురుగునీటినే తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలో 53 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా 50 శాతం ట్యాంకుల్లో కూడా క్లోరినేషన్ చేపట్టకుండా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

క్లోరినేషన్ చేయడమే మరిచారు



తుంగమడుగు గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ మెట్లు శిథిలావస్థకు చేరిన దృశ్యం

దొరవారిసత్రం : మండల పరిధిలోని కుగ్రామాలతో కలిపి 65 గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ, పంచాయతీల నిర్వహణ పరిధిలో పీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్ పథకాలు కలిపి 85 మంచి నీటి పథకాలు ఉన్నాయి. ఇందులో 25 ప్రాంతాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల ద్వారా తాగునీరు సరఫరా అవుతుండగా.. కొన్ని గ్రామాలకు మంచి నీటి బావుల ద్వారా నేరుగా ఆయా ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే ఒకటి రెండు గ్రామాల్లో తప్పా చాలాచోట్ల ట్యాంకుల శుభ్రం జరగడం లేదు. కొన్ని గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నిచ్చెనలు లేకపోడంతో ఏళ్ల తరబడి శుభ్రం చేయడం లేదు.

చిట్టమూరులో..

చిట్టమూరు: మండలంలో 23 పంచాయతీల ఉండగా.. 3 రాజీవ్ టెక్నాలజీ పథకాలు, 56 పథకాల ద్వారా గ్రామ పంచాయతీలకు తాగునీరు సరఫరా అవుతుంది. అయితే చాలా గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు శుభ్ర చేయడం లేదు. ఓవర్ హెడ్ ట్యాంక్‌లో క్లోరినేషన్ చేయకపోవడంతో కలుషిత నీరే సరఫరా అవుతుంది. కొన్నిచోట్ల తాగునీటి పైపుల నుంచి నీరు లీకై కలుషితం అవుతోంది. మల్లాం గ్రామంలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో శుభ్రం చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారు. దరఖాస్తు గ్రామంలో తాగునీటి పథకానికి సంబంధించిన వాటర్ ట్యాంక్‌లో బోరు ద్వారా వచ్చే ఇసుక పేరుకుపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు.



చిట్టమూరు: మల్లాం గ్రామంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంక్

పెళ్లకూరులో..



రాజీవ్ టెక్నాలజీ మంచినీటి పథకం


పెళ్లకూరు: ప్రతి ఇంటికీ కొళాయి.. తాగునీరు సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మంచినీరు అందక పల్లె జనం అల్లాడుతున్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో 127 తాగునీటి బోర్లు, 18 ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, 53 మినీ వాటర్ స్కీమ్‌లు, రాజీవ్ టెక్నాలజీ మంచి నీటి పథకం ఉన్నాయి. అయితే ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు విధిలేని పరిస్థితుల్లో రూ.15 వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు.

“ ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తాం



గ్రామీణుల నుంచి తాగునీటి ఇబ్బందుల గురించి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నాం. ఇబ్బందులు ఉన్న చోట నీటి నాణ్యత పరీక్షలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఓవర్ హెడ్ ట్యాంకుల శుభ్రత విషయంలోనూ పంచాయతీ పాలకులతో కలసి చర్యలు తీసుకుంటున్నాం. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తున్నాం. వర్షాకాలంలో అన్ని గ్రామాల్లో నీటిని పరీక్షించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చాం. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు నీటి పరీక్షలపై శిక్షణ కూడా ఇచ్చాం. – నరేంద్ర, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్, తిరుపతి జిల్లా

● స్వర్ణకాంతుల్లో కోవెల



జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీవేదవల్లి సమేత వేదనారాయణ స్వామి ఆలయం స్వర్ణకాంతితో శోభాయమానంగా కనిపించింది. గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షం అనంతరం సాయంత్రం 6.30 గంటలకు వేదనారాయణ స్వామి ఆలయ రాజగోపురం స్వర్ణ కాంతులతో మిరుమిట్లు కొలుపుతూ భక్తులను ఆకట్టుకుంది. ఈ సుందర దృశ్యాన్ని ప్రజలు సన్నిధి వీధిలోని టవర్‌క్లాక్ కూడలిలో నిలుచుకుని వీక్షించారు. సూర్య కిరణాల వెలుగులో ఆలయ గోపురం కాంతులీనింది. దీనికితోడు ఆలయ గోపురంపై ఏర్పడిన ఇంద్రధనస్సు భక్తులను మైమరిపించింది.

– నాగలాపురం

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- 4 వేల మంది పోలీసులతో పటిష్ట భద్రత
- గరుడ సేవరోజు రద్దీని పురస్కరించుకుని ఏర్పాట్లు
- జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు


తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుమలలో గురువారం టీటీడీ అదనపు ఈవోతో కలసి ఎస్పీ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల భద్రత, సౌకర్యం కోసం సమగ్రంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్, క్యూలైన్లు, అత్యవసర వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం అంశాలపై దృష్టి పెట్టామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా టీటీడీ విభాగాలతో సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. 4 వేల మంది పోలీసులు, కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచామన్నారు. ఇంటిగ్రేడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. గరుడ సేవ రోజున రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, వాహనాల పార్కింగ్ కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుపతిలో ఐదు ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామన్నారు. ఆ స్థలాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు భక్తులను తరలిస్తామని తెలిపారు. అనంతరం టీటీడీ సీవీఎస్ ఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆక్టోపస్, ఎస్డీఆర్‌ఎఫ్ బలగాలు నిరంతరం భక్తుల భద్రతను పర్యవేక్షిస్తాయన్నారు. పార్కింగ్ స్థలాలను తెలియజేసే వీడియోలను కూడా విడుదల చేస్తామన్నారు. వాహన సేవకు వచ్చే భక్తులు గ్యాలరీలో ఉండే సమయంలో పాదరక్షలు, లగేజీలు తీసుకురావద్దని విన్నవించారు. శ్రీవారి వాహనాలపై చిల్లర నాణ్యాలు విసరడం నిషేధించామని పేర్కొన్నారు.

భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోండి

ఎస్పీ సుబ్బరాయుడు తిరుమలలోని టాక్సీ డ్రైవర్లతో సమావేశమయ్యారు. భక్తులను సురక్షితంగా గమ్యం చేర్చాలన్నా రు. గరుడ సేవ రోజున భక్తుల రద్దీ అధికంగా ఉండే దృష్ట్యా భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పెద్దవారికి రూ.110, చిన్నపిల్లలకు రూ.60 మాత్రమే తీసుకోవాలన్నారు.

గోవిందదాసుడిగా ఎన్ని కష్టాలకైనా సిద్ధం

- హిందువుల మనోభావాలు దెబ్బతీయకండి
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణకార రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : శ్రీరాముడి పట్ల అకుంటితమైన పరమభక్తుడిగా ఆనాడు రామదాసు ఎన్ని కష్టాలు పడ్డాడో.. అదేవిధంగా ఈరోజు గోవిందదాసుడిగా శ్రీవారి ఆలయ పరిరక్షణ, హైందవ ధర్మాన్ని కాపాడడం కోసం తాను ఎన్ని కష్టాలు పడడానికైనా సిద్ధమేనని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టంచేశారు. తిరుపతి పద్మావతీపురంలోని తన నివాసంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అలిపిరి పాదాల చెంత మలమూత్రాలు, మద్యం బాటిళ్ల మధ్య మహావిష్ణువు విగ్రహాన్ని టీటీడీ పాలకవర్గం, అధికారులు పడవేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విషయాన్ని ఎత్తిచూపితే తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడంతో పాటు ఎదురు దాడులకు సిద్ధపడడం సిగ్గుచేటన్నారు. త్రిశూలధారి శివుడు, శంకుచక్రధారి శ్రీమహావిష్ణువు, వేదవాఙ్మయధారి చతుర్ముఖుడైన బ్రహ్మ అని అందరికీ తెలిసిన విషయమన్నారు. ఇవేవీ తెలియని మూర్ఖుల్లా, చేసిన తప్పిదాలను సరిదిద్దుకోకుండా తనపై లేనిపోని అభాండాలు వేస్తూ దానికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ఈ రోజు ఓ పత్రికలో పెద్ద వ్యాసం వచ్చిందని, ఆ కళాశాల ప్రిన్సిపల్‌తో బలవంతంగా మాట్లాడించడమే కాకుండా కణ్ణన్ ఆచారి అనే వ్యక్తి కర్ణాటకకు చెందిన ఓ భక్తుడు రూ.2 లక్షలు శనేశ్వరస్వామి విగ్రహాన్ని తయారు చేసేందుకు అడ్వాన్స్ ఇచ్చారని, ఆ తర్వాత అతను చనిపోతే, టీటీడీ కాంట్రాక్టర్లు ఎవరో ఆ విగ్రహాన్ని అలిపిరి పాదాల చెంత టీటీడీ స్థలంలో తీసుకొచ్చి పడేశారని చెప్పడం వారి కట్టుకథలకు నిదర్శనమన్నారు. రాయలచెరువు దగ్గర తయారు చేసిన శనేశ్వరస్వామి విగ్రహాన్ని టీటీడీ స్థలంలోకి తీసుకురావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇవేవీ తెలియకుండా టీటీడీ పాలకవర్గంతో పాటు అధికారులు తానేదో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నట్లుగా చిత్రీకరించి తనపై లేనిపోని అవాస్తవ కేసులను పెట్టి నోటీసులు జారీచేశారని మండిపడ్డారు. తాను ఇలాంటి కేసులకు భయపడేవాడిని కాదని, తనపై ఎన్ని కేసులు పెట్టినా హైందవ ధర్మ పరిరక్షణను, శ్రీవారి ప్రతిష్టను కాపాడుకునేందుకు టీటీడీలో జరిగే తప్పిదాలను ఎత్తిచూపుతూనే ఉంటానన్నారు.

క్లుప్తంగా

ఫిజియోథెరపీ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు


నియామక పత్రాలను అందిస్తున్న డైరెక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన మ్యాక్సిమస్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ డాక్టర్ సద్దాం హుసేన్ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా తిరుపతి స్విమ్స్‌లో 55 మందిని ఎంపిక చేసి వారిలో 5 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ స్విమ్స్‌లో ఎంతోమంది ఫిజియోథెరపీ, నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సులు పూర్తిచేసి విదేశాల్లో వివిధ హాస్పిటళ్లలో పనిచేస్తున్నారని, ప్రధానంగా ఫిజియోథెరపీలో శిక్షణ పొంది మంచి ఉపాధి అవకాశాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

6 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుపతి మంగళం అటవీ ప్రాంత పరిసరాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్, ఆర్ఐ సాయిగిరిధర్, ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం మామండూరు నుంచి కరకంబాడి అటవీ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున కూంబింగ్ చేపట్టారు. మంగళం సమీపంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు తరలిస్తూ కంటపడ్డారు. వారిని వెంబడించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అదుపులో ఉన్నవారు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. దుంగలతో పాటు ఇద్దరిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు దగ్ధం


కాలిపోయిన దుస్తులు

సైదాపురం: మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఓ రేకుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన ఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా.. ఊటుకూరు గ్రామానికి చెందిన రమణమ్మ గురువారం సాయంత్రం ఇంట్లో పనులు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లో మంటలు వ్యాపించి వస్తువులతో పాటు బీరువాలో ఉన్న నగదు, బంగారం, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఇల్లు కాలిపోవడంతో కట్టుబట్టలు మిగిలాయని.. తనకు అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితురాలు రమణమ్మ వేడుకుంది.

కలానికి సంకెళ్లు అప్రజాస్వామికం



ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల గొంతుకను వినిపించే పత్రికపై కక్షపూరిత చర్యలు అప్రజాస్వామికం. పత్రికలపై దాడులు చేసి అక్రమ కేసులు బనాయించడం కలానికి సంకెళ్లు వేయడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు ఉన్న మీడియాపై కేసులు పెట్టడం సరికాదు. పత్రికా స్వేచ్ఛను హరిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లుతుంది. సాక్షి ఎడిటర్‌తో పాటు సాక్షి జర్నలిస్టులపై నమోదుచేసిన కేసులను ఉపసంహరించుకోవాలి. పత్రికల్లో వచ్చిన వార్తలపై అభ్యంతరకరంగా ఉంటే వివరణ కోరాలే తప్ప అక్రమ కేసులు పెట్టి కక్ష సాధింపులకు పాల్పడడం అన్యాయం. – ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి.



మీడియా స్వేచ్ఛకు ముప్పు

మీడియాపై అక్రమ కేసులు పెట్టడం అంటే పత్రికా స్వేచ్ఛను హరించినట్టే. ప్రభుత్వం చేసే తప్పులు ఎత్తి చూపుతూ ప్రజా సమస్యలను పత్రికల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న పాత్రికేయులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే కేసులు పెట్టడం అన్యాయం. ఉన్నది ఉన్నట్టుగా వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు పెట్టి కక్ష సాధించాలనుకోవడం సరైన పద్ధతి కాదు. ప్రజలకు, పాలకులకు వారధులుగా, సమాజంలోని సమస్యలను వెలుగెత్తి చాటే విలేకర్లపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తేయాలి. పత్రిక గొంతు నొక్కినంత మాత్రాన నిజం నిజం కాకుండా పోతుందా ? నచ్చని అంశాలు ప్రచురితమైతే ఖండన ఇవ్వాలి. అంతే తప్ప పనిగట్టుకుని కేసులు పెట్టడం అన్యాయం. – సద్దాం, స్టూడెంట్స్ జేసీ చిత్తూరు జిల్లా చైర్మన్



ఆక్వా రంగాన్ని ఆదుకోండి

- పార్లమెంటులో గళం విప్పిన ఎంపీ గురుమూర్తి
- అమెరికా సుంకాల తగ్గింపునకు ఏం చర్యలు తీసుకుంటారని ప్రశ్న
- స్పందించిన కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్
- సుంకాలను తగ్గించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని హామీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆక్వా సాగుదారులు


ఎగుమతికి సిద్ధంగా ఉన్న రొయ్యలు

చిల్లకూరు: ఆక్వా రైతులు ఎదర్కొంటున్న సమస్యలపై పార్లమెంటులో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గళం విప్పి అమెరికా విధిస్తున్న సుంకాలను తగ్గింపు అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించేందుకు సుముఖత వ్యక్తం చేయడంపై రొయ్యల సాగుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏపీలో అధికభాగం తిరుపతి జిల్లాలో రొయ్యల సాగు చేస్తున్నారు. సుమారు 175 కి.మీ. దూరం ఉన్న సముద్ర తీరాన్ని ఆసరా చేసుకుని చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రొయ్యల సాగును సుమారుగా 28 వేల ఎకరాల్లో చేపడుతున్నారు. దీంతో ఏకంగా 1.25 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి జరుగుతుంది. ఏపీలో సాగయ్యే రొయ్యల్లో సుమారు 70 శాతం వరకు అమెరికా లాంటి దేశాలకు ఎగుమతి చేసి ఆర్థిక పరిపుష్టి సాధించేవారు.

ట్రంప్ చర్యలతో ఆర్థిక నష్టాలు..

రొయ్యల సాగుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు పెంచి ఎగుమతులకు అడ్డుకట్ట వేశారు. దీంతో రొయ్యల రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. దీంతో అమెరికా సుంకాలపై ఎంపీ మద్దిల గురుమూర్తి అడిగిన ప్రశ్నతో కేంద్ర వాణిజ్య పరిశ్రమల సహాయ మంత్రి జితిన్ ప్రసాద్, సమగ్ర పరిశీలన జరిపిన తరువాత మెరైన్ ప్రొడక్ట్ ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎంపెడా)తో చర్చించి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అమెరికా పరస్పర సుంకాల నిర్ణయంతో ఆక్వా రైతులు నష్టపోకుండా ఉండేలా కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అధిక విలువలు కలిగిన సముద్ర జాతుల ఉత్పత్తిపై దృష్టి సారిస్తుందన్నారు. ఇందులో సిబాస్, కోబియా, పొంపానో, క్రాబ్, తిలాపియా, గ్రూపర్, బ్లాక్ టైగర్, స్కాంపి వంటి జాతులను ప్రోత్సహించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తద్వారా ఆక్వా సాగుదారులపై ఆర్థిక భారం తగ్గించేలా సహాయ పడుతుందన్నారు. ఎంపెడా కూడా కొత్త మార్కెట్లను గుర్తించడంతో పాటు ఇప్పటికే ఉన్న మార్కెట్లను విస్తరించే దిశగా అడుగులు వేస్తుందని తెలిపారు. ఆక్వా సాగుదారులకు లాభదాయకమైన ఆదాయ మార్గాలు వచ్చేలా విదేశీ ప్రదర్శనలు, దేశీయ మార్కెట్‌లో ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు కేంద్ర మంత్రి సమాధానం ఇవ్వడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా సాగుదారులకు అండగా నిలిచి కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ఎంపీ గురుమూర్తికి అండగా ఉంటామని ఆక్వా రైతులు చెబుతున్నారు.

సంతోషంగా ఉంది..



సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రైతుల సమస్యలపై పార్లమెంటులో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి గళం విప్పి సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడం సంతోషంగా ఉంది. ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర పభుత్వం సమాధానం ఇస్తూ.. సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పడంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని హామీ ఇవ్వడం హర్షదాయకం.
– కందలూరు మదన్‌మోహన్‌రెడ్డి, ఆక్వా రైతు, చిల్లకూరు మండలం

బాధలను అర్థం చేసుకున్నారు..



గత కొంతకాలంగా తాము పడుతున్న ఆర్థిక ఇబ్బందులు, అమెరికా సుంకాలతో చితికిపోతున్న సాగుదారుల బాధలను అర్థం చేసుకుని పార్లమెంటులో తిరుపతి ఎంపీ గురుమూర్తి చర్చించడం ఆనందంగా ఉంది. తిరుపతి జిల్లాలో అధికభాగం సాగులో ఉన్న టైగర్, వెనామీ రొయ్యల రైతులకు తిరుపతి ఎంపీ అడిగిన ప్రశ్నకు.. కేంద్ర మంత్రి ఇచ్చిన హామీ ఆర్థిక ఊరటనిస్తుంది. దీని వల్ల రొయ్యల రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు.
– మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఆక్వా సాగుదారుడు, యాకసిరి, చిట్టమూరు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను
కాపాడుకుందాం


చలో మదనపల్లె మెడికల్ కాలేజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : పేదలకు ఉచిత వైద్యం, పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను అందించేందుకు జగనన్న నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం కాకుండా కాపాడుకుందామని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతి పురంలోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద గురువారం నేడు చలో మదనపల్లె మెడికల్ కాలేజ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆరె.అజయ్ కుమార్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లం రవికుమార్, జిల్లా, నగర అధ్యక్షుడు ఉదయ్ వంశీ, దినేష్‌రాయల్, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజీ'ని విజయవంతం చేయండి


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న చలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువజన, విద్యార్థి విభాగం నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

చలో మదనపల్లెకు తరలిరండి


చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు అందరూ 'చలో మదనపల్లె మెడికల్ కాలేజీ' ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గురువారం పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు మదనపల్లిలోని ఆరోగ్యవరం (శానిటోరియం) మెడికల్ కాలేజీ వద్దకు చేరుకోవాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి విద్యార్థి విభాగం నేతలు ఉదయం 7 గంటలకు తుమ్మలగుంట నుంచి బయలుదేరనున్నట్టు తెలిపారు.

జయప్రదం చేయండి


డాక్టర్ ఓబుల్ రెడ్డి

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయడం దారుణమని వైఎస్సాఆర్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి అన్నారు. విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చలో మదనపల్లె మెడికల్ కళాశాల కార్యక్రమం చేపట్టామని ఆ సంఘం తెలిపారు. పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు.

కూటమి కుట్రలను అడ్డుకుంటాం

నాయుడుపేట టౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కట్టిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుయుక్తులను అడ్డుకుంటామని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. గురువారం నాయుడుపేటలో చలో మెడికల్ కాలేజ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, ఒట్టూరు కిషోర్ యాదవ్, ఓజిలి మండల కన్వీనర్ పాదర్తి హరినాథ్‌రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


చలో మెడికల్ కాలేజ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంజీవయ్య, నాయకులు

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ


పవిత్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న అర్చకులు

వడమాలపేట (పుత్తూరు) : అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో రెండవ రోజైన గురువారం స్వామి వారికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. అనంతరం మూలవిరాట్టు, ఉత్సవర్లకు, పద్మావతీ, ఆండాళ్ అమ్మవారు, జయ విజయులు, గరుడాళ్వార్, ఆంజనేయస్వామికి, ధ్వజస్తంభం, ఇతర పరివార దేవతలకు పవిత్ర సమర్పణ చేశారు. సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్రోత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

పవిత్రోత్సవాల్లో నేడు

పవిత్రోత్సవాల్లో శుక్రవారం ఉదయం 9–30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన నిర్వహించనున్నారు.

కృత్రిమ కాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

–నేటి నుంచి పేర్ల నమోదు

తిరుపతి అర్బన్: నడవలేని దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారు కృత్రిమ కాళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రాజా వినోద్ తెలిపారు. తమ పేర్లు, పూర్తి చిరునామాతో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ప్రభుత్వం తరపున ఉచితంగా కృత్రిమ కాళ్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘ నేతల సహకారంతో శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కృత్రిమ కాళ్లు అవసరమైన వారు 99892 06667, 9000010390, 9885529768, 93471316 83, 8500930530 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కల్యాణ వెంకన్నకు పవిత్రాల సమర్పణ


దేవతామూర్తులకు పవిత్రమాలను ధరింపజేస్తున్న దృశ్యం


యాగశాల నుంచి పవిత్ర మాలలను ఆలయానికి తీసుకొస్తున్న అర్చకులు

తిరుపతిరూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో కొలువైన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాల్లో మూడో రోజు పవిత్రాల సమర్పణ వేడుకగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున అర్చకులు శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకం, ధూపదీప నైవేద్యాలు పూర్తిచేశారు. అనంతరం వేదపండితులు యాగశాల నుంచి పట్టు పవిత్రాలను మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ఆలయానికి తెచ్చి మూలమూర్తి మెడలో సమర్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, మలయప్ప స్వామివారికి, పరివార దేవతామూర్తులకు, ధ్వజ స్తంభానికి, ఆంజనేయస్వామికి, ఆలయం వెలుపల ఉన్న మహాగణపతి, మహాలక్ష్మీ అమ్మవార్లకు సమర్పించారు. పవిత్ర మాలల సమర్పణలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, ఆయన సోదరుడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి, మంజుల దంపతులతో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు పవిత్ర వితరణ..

పవిత్రోత్సవాల్లో చివరిరోజైన శుక్రవారం చతుష్టానార్చన, మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్ర విసర్జన, స్నపనతిరుమంజనం, పవిత్రవితరణ, చక్రస్నానం సాయంత్రం వీధి ఉత్సవంతో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి.

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి కాంస్యం


రమాజ్యోతిని అభినందిస్తున్న వీసీ ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి రూరల్: బ్రెజిల్‌లో సెప్టెంబర్ 16వ తేదీన జరిగిన బ్రిక్స్ స్కిల్స్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంపిటిషన్‌లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఎస్.రమాజ్యోతి కాంస్య పతకం సాధించారు. ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పోటీల్లో స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, డిజిటల్ టెక్నాలజీల ఆధారంగా పోటీలు నిర్వహించారు. ''స్మార్ట్, హ్యూమన్, హ్యాపీ అండ్ రెసిలియెంట్ సిటీస్'' అనే ప్రధాన థీమ్‌కు చెందిన ఇన్నోవేషన్‌ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. తిరుపతి నుంచి శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన స్కూల్ ఆఫ్ ఇంజి అండ్ టెక్నాలజీ అధ్యాపకురాలు డా. ఎస్. రమాజ్యోతి తన బయో డిగ్రేడబుల్ ఫుడ్ ప్యాకేజింగ్ ఉత్పత్తులు (బయో ప్యాక్ ఇన్నోవేషన్స్) ను ''కేతనా టెక్‌టీస్'' స్టార్టప్ తరపున వర్చువల్‌గా ప్రదర్శించారు. అర్బన్ సస్టయినబిలిటీ–అడ్వాన్స్‌డ్ మ్యానుఫాక్చరింగ్ విభాగంలో ఆమె చేసిన ఆవిష్కరణకు కాంస్య పతకం లభించింది. ఈ సందర్భంగా యూనివర్శిటీ వీసీ ఆచార్య వి.ఉమ మాట్లాడుతూ పర్యావరణహితమైన, పట్టణ ప్రగతికి అనుగుణమైన పరిష్కారాలను తీసుకువచ్చే ఆవిష్కరణలకు ఇది గొప్ప గుర్తింపు అన్నారు. ఎస్.రమాజ్యోతి, ఎస్ఎస్ఐఐఈ–టీబీఐ బృందానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్. రజని అభినందనలు తెలిపారు.

అన్న ప్రసాద కేంద్రంలో టీటీడీ ఈవో తనిఖీలు

తిరుమల: టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ గురువారం సాయంత్రం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడి దర్శన సమయాలు, టోకెన్ విధానం, క్యూలో సౌకర్యాలు, అన్నప్రసాదం రుచి, తిరుమలలో వివిధ పాయింట్ల వద్ద అన్న ప్రసాదాల పంపిణీ తదితర అంశాలపై సమాచారం సేకరించారు. వంటశాల, స్టోర్ రూమ్, జీడి పప్పు బాక్స్‌లను పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అన్న ప్రసాద కేంద్ర సిబ్బంది, శ్రీవారి సేవకులతో కూడా మాట్లాడారు. ఈ తనిఖీల్లో అన్నప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్ర, స్పెషల్ కేటరింగ్ అధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.